# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ:  27-07-2025                    సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- స్వచ్ఛ భారత్ ఉద్యమం ఒక ప్రజా ఉద్యమంగా మారిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ “మన్ కీ బాత్” కార్యక్రమం ద్వారా వెల్లడించారు.
- ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను, అంకుర సంస్థలను ప్రోత్సహించే విధంగా రాష్ట్రం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు.
- వ్యవసాయవృద్ధికి, సాగునీటికి అధిక ప్రాధాన్యతనిస్తూ.. ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్మాణం చేపడుతోందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.
- భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య మాంచెస్టర్ లో జరుగుతున్న నాలుగవ టెస్టు క్రికెట్ మ్యాచ్ లో భారత్ రెండవ ఇన్నింగ్స్‌లో భోజన విరామ సమయానికి 4 వికెట్లకు 223 పరుగులు చేసింది.

==============================

దేశమంతా ఒకే ఆలోచనతో, ఐకమత్యంగా ముందుకు వెళితే దేనినైనా సాకారం చేసుకోవచ్చని, స్వచ్ఛ భారత్ ఉద్యమం దీనికి ఉదాహరణగా నిలుస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. మన్ కీ బాత్ మనసులోని మాట కార్యక్రమం 124వ సంచికలో భాగంగా ఈ రోజు దేశ ప్రజలనుద్దేశించి ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ.... త్వరలో ఈ ఉద్యమానికి 11 సంవత్సరాలు పూర్తవుతుందని చెబుతూ... స్వచ్ఛ భారత్ ఉద్యమం ఒక ప్రజా ఉద్యమంగా మారిందని, ప్రజలు దీనిని తమ కర్తవ్యంగా భావించారని అన్నారు. ఈ సంవత్సరం స్వచ్ఛ సర్వేల్లో దేశవ్యాప్తంగా 4 వేల 500 కంటే ఎక్కువ నగరాలు, ప్రాంతాలు పాల్గొన్నాయని, 15 కోట్లకు పైగా ప్రజలు వీటిలో భాగమయ్యారని చెప్పారు. ప్రతి రోజు, ప్రతి క్షణం శుభ్రతకు ప్రాధాన్యం ఇచ్చినప్పుడే.. దేశం శుభ్రంగా మారుతుందని నరేంద్రమోదీ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

ఒలింపిక్స్ తర్వాత అతి పెద్ద క్రీడా కార్యక్రమంగా నిలిచే అంతర్జాతీయ పోలీసు, అగ్నిమాపక సిబ్బంది మధ్య అమెరికాలో జరిగిన క్రీడా పోటీల్లో భారత్ 600 వరకూ పధకాలు సాధించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. 2029లో ఈ క్రీడలు భారత్ లో జరుగుతాయని చెప్పారు.

(వాయిస్ 32 సెకన్లు)

స్వదేశీ ఉద్యమం చేనేత వస్త్రాలకు నూతన శక్తిని అందించిందని అన్నారు. ఈ ఉద్యమాన్ని గుర్తు చేసుకుంటూ.. ఆగస్టు 7వ తేదీన జాతీయ చేనేత దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. మన ఖాదీ స్వాతంత్ర్య ఉద్యమానికి కొత్త శక్తిని అందించినట్లుగా... నేడు వస్త్ర రంగం దేశానికి ఒక బలమైన శక్తిగా నిలుస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు.

==============================

ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను, అంకుర సంస్థలను ప్రోత్సహించే విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. సింగపూర్ పర్యటనలో భాగంగా ఈ రోజు తెలుగు డయాస్పోరా ఫ్రం సౌత్ ఈస్ట్ ఏషియా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి మాట్లాడుతూ... సంపద సృష్టిస్తేనే ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుందని, తద్వారా సంక్షేమ పథకాలు అందించడం సాధ్యపడుతుందన్నారు. ఇక్కడ వ్యర్థాల నిర్వహణను పరిశీలించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాత్రి సమయంలో వ్యర్థాలను సేకరించే వ్యవస్థను ఏర్పాటు చేసిన సందర్భాన్ని గుర్తు చేశారు.

(వాయిస్ 25 సెకన్లు)

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... విదేశీ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడాన్ని తాము స్వాగతిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పి.నారాయణ, టి.జి. భరత్, భారతీయ హైకమీషనర్ శిల్పక్ అంబులే తదితరులు పాల్గొన్నారు.

విరామం

==============================

ప్రజల రాష్ట్రపతిగా ఏపీజే అబ్దుల్ కలాం నిలిచారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. పూర్వ రాష్ట్రపతి ఏ.పి.జె అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఈరోజు ఆయనకు నివాళులు అర్పించారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ముఖ్యమంత్రి స్పందిస్తూ... శాస్త్రవేత్తగా, దేశ అణు, శాస్త్రీయ రంగాలకు మార్గనిర్దేశం చేసిన దార్శనికుడుగా అబ్దుల్ కలాం నిలిచారన్నారు. మహోన్నత మానవతావాదిగా నిలిచిన ఆయన సేవలను స్మరించుకుందామని ముఖ్యమంత్రి తన సందేశంలో పేర్కొన్నారు.

==============================

ఎన్డీయే కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు సమాన ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఈ రోజు విజయనగరం రెవెన్యూ డివిజన్ పరిధిలోని మెంటాడ మండలం, ఆండ్ర గ్రామంలో ఆండ్ర రిజర్వాయర్ నుంచి నీటిని, స్త్రీ, శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణితో కలిసి మంత్రి విడుదల చేశారు. ఈ సందర్భంగా కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ... వ్యవసాయవృద్ధికి, సాగునీటికి అధిక ప్రాధాన్యతనిస్తూ.. ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్మాణం చేపడుతోందని తెలిపారు. ప్రాజెక్ట్ మరమ్మతులు, అభివృద్ధి పనులకు రెండున్నర కోట్ల రూపాయలు మంజూరు చేశామని వెల్లడించారు. ప్రతి ఎకరానికీ నీరు అందేలా అధికార యంత్రాంగం సమర్థవంతంగా పని చేయాలన్నారు.

==============================

పోలవరం ప్రాజెక్టును 2027 డిసెంబర్ నాటికి పూర్తి చేసే విధంగా ప్రభుత్వం కృత నిశ్చయంతో పని చేస్తోందని రాష్ట్ర జలవనురుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. "సుపరిపాలనలో తొలి అడుగు" కార్యక్రమంలో భాగంగా ఈ రోజు ఆయన అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరులో పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం సామాజిక పింఛన్లను 4 వేలకు పెంచామని, నిరుద్యోగ యువతకు 16 వేల ఉపాధ్యాయ ఉద్యోగాలను డీఎస్సీ ద్వారా భర్తీ చేయడం జరుగుతోందన్నారు. తల్లికి వందనం పథకంలో ప్రతి విద్యార్థికి 13 వేల రూపాయల చొప్పున ఆర్థిక సాయం అందించామన్నారు. పీఎం కిసాన్ నిధులు జమ అయిన వెంటనే అన్నదాత సుఖీభవ కింద 20 వేల రూపాయలను ప్రతి రైతు కుటుంబానికి ప్రభుత్వం అందిస్తుందన్నారు.

==============================

భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య మాంచెస్టర్ లో జరుగుతున్న నాలుగవ టెస్టు క్రికెట్ మ్యాచ్ లో భారత్ రెండవ ఇన్నింగ్స్‌లో భోజన విరామ సమయానికి 4 వికెట్లు నష్టపోయి 223 పరుగులు చేసింది. 2 వికెట్ల నష్టానికి 174 పరుగుల ఓవర్ నైట్ స్కోర్‌తో చివరి రోజు ఆట ప్రారంభించిన భారత్, తొలి సెషన్‌లో కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 103 పరుగులు, కె ఎల్ రాహుల్ 90 పరుగుల వద్ద వికెట్లను కోల్పోయింది. కాగా భారత్ ఇంకా 88 పరుగుల వెనుకంజలో ఉంది.

==============================

ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి, పశ్చిమ గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా రాష్ట్రంలో రాగల రెండు రోజులు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో  కూడిన జల్లులు కొన్ని చోట్ల కురుస్తాయని పేర్కొంది.

==============================

==============================